# జీఎస్‌లో... ఆధునిక భారతదేశ చరిత్రకే ప్రాధాన్యం

**పోటీ పరీక్షల్లో హిస్టరీకి ఎనలేని ప్రాధాన్యం ఉంది. అప్పటిదాకా ఈ సబ్జెక్టుతో ఎలాంటి పరిచయం లేని వారు సైతం పోటీ పరీక్షలు రాయడానికి సిద్ధమైతే విధిగా చదవాల్సిందే. 'చరిత్ర'ను చదవకుండా సివిల్స్ పాసవడం కష్టం.**

సివిల్స్ పరీక్షలో మొదటి అంకమైన జనరల్ స్టడీస్‌కు ప్రిపేరయ్యే అభ్యర్థులు హిస్టరీపై ప్రత్యేక దృష్టిసారించాలి. అయితే.. ఈ సబ్జెక్టుకు సంబంధించి సిలబస్‌లోని ఏయే అంశాలకు ప్రాధాన్యమివ్వాలనే విషయాన్ని తప్పనిసరిగా గ్రహించాలి. జీఎస్‌లో విజయం సాధించేందుకు ఇదెంతో తోడ్పడుతుంది. త్వరలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా జీఎస్ పేపర్‌లో 'చరిత్ర' నుంచి అడుగుతున్న ప్రశ్నల సరళిని తెలిపే ప్రత్యేక వ్యాసమిది. సివిల్స్ జనరల్ స్టడీస్ పేపర్‌లో ప్రాచీన, మధ్యయుగాల భారతదేశ చరిత్ర నుంచి అడుగుతున్న ప్రశ్నల సంఖ్య తక్కువగా ఉంటోంది. చరిత్ర నుంచి అడుగుతున్న మొత్తం ప్రశ్నల్లో సింహభాగం ఆధునిక భారతదేశ చరిత్రదే. గత ఐదేళ్లలో పేపర్ వారీగా పరిశీలిస్తే.. ప్రాచీన, మధ్యయుగ విభాగాల నుంచి కనీసం ఒక ప్రశ్న, అత్యధికంగా 11 ప్రశ్నలు మాత్రమే ఇచ్చారు. అభ్యర్థులు తప్పనిసరిగా గమనించాల్సిన అంశమిది...

### అంశాల వారీగా..

ప్రశ్నల స్వభావాన్ని గమనిస్తే.. ప్రాచీన భారతదేశ చరిత్రలో సంస్కృతికి సంబంధించి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. సింధు నాగరికత, వేద సాహిత్యాలు, బౌద్ధ, జైనమతాలు వాటి సాహిత్యం; వాస్తు సంప్రదాయంలో భాగంగా గాంధార, మధుర, అమరావతి శైలులు; గుప్తుల కాలం నాటి స్వర్ణయుగం గురించి అడిగినపుడు సాహిత్యం, వాస్తు, శిల్పం, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతి వంటి అంశాలు ముఖ్యమైనవి. ఈ విభాగంలో రాజకీయపరమైన చరిత్రకు ప్రాధాన్యం తక్కువ. రాజవంశాలు, యుద్ధాలు దాదాపు ప్రశ్నలు అడగటంలేదని గుర్తించాలి. వీటిపై ప్రశ్నలు వచ్చినా.. కేవలం మహాజన పదాలు, మౌర్యులపైనే ఉంటాయి. అలాగే మౌర్యానంతర రాజ వంశాలు ముఖ్యంగా.. ఇండో గ్రీకు, శక, కుషాన్, పార్థియన్ల గురించి మౌలిక సమాచారాన్ని గ్రహించే ప్రయత్నం చేయాలి. వేద నాగరికతకు సంబంధించి.. వేదాలు, ఉపనిషత్తులు, వేదాంగాలు, ఉపవేదాల వంటి అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి. మత సంస్కరణోద్యమాల్లో బుద్ధుడు, వర్ధమానుడి వ్యక్తిగత జీవితంతోపాటు వారి బోధనలు, సమావేశాలు ముఖ్యమైనవి. ప్రాచీన భారతదేశ సంస్కృతిలో భాగంగా అభివృద్ధి చెందిన కళలు, సాంస్కృతిక వికాసం చదివినపుడు ముఖ్యంగా బౌద్ధ వాస్తు శైలి, శిల్ప శైలులు; బౌద్ధ, జైన సంస్కృతి-సాహిత్యం విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

## మధ్యయుగ భారతదేశ చరిత్ర :

ఈ విభాగంలో ఇండో-ఇస్లామిక్ సంస్కృతి ముఖ్యమైన అంశం. భక్తి, సూఫీ ఉద్యమాలు.. ముఖ్యంగా భక్తి ఉద్యమకారులైన రామానంద, కబీర్, మరాఠా భక్తి ఉద్యమకారులు, సూఫీ యోగులు; వాస్తు శైలిలో భాగంగా.. సుల్తానులు, మొగలులు నిర్మించిన కట్టడాలు, సంగీతం, చిత్రలేఖనం, సాహిత్యం అభివృద్ధి చెందిన తీరు వంటి అంశాలపై తరచూ ప్రశ్నిస్తున్నారు. మొగల్ సామ్రాజ్య విస్తరణలో భాగంగా జరిగిన ముఖ్య యుద్ధాల గురించి క్షుణ్నంగా చదవాలి. వీటితోపాటు రాజవంశాలు-స్థాపకుల గురించి తెలుసుకోవాలి. ఢిల్లీ సుల్తానుల చరిత్రలో ముఖ్యులైన ఐబక్, ఇల్ టుట్ మిష్, అల్లాఉద్దీన్ ఖిల్జీ, మహమ్మద్ బీన్ తుగ్లక్, ఫిరోజ్‌షా తుగ్లక్ వంటి ప్రముఖ పాలకుల సంస్కరణలు తెలుసుకోవాలి. పాలనా వ్యవస్థలు అంటే.. సుల్తానుల కాలం నాటి ఇక్తా విధానం, విజయనగర కాలంనాటి నాయక విధానం, మొగల్ మున్సబ్‌దారీ విధానం, మిరాశీ విధానం తదితర వ్యవస్థల గురించి కూడా తెలుసుకోవాలి. దక్షిణ భారతదేశ చరిత్రలో చోళ, రాష్ట్రకూట వంశ స్థాపకులు, వారిలో గొప్ప పాలకుల గురించి ప్రాథమిక అవగాహన పెంచుకోవాలి. వీరి హయాంలో జరిగిన ఆలయాల నిర్మాణాలు, విజయనగర, బహుమనీ రాజవంశాల్లో ముఖ్యులు, నాటి సాంస్కృతిక వికాసం వంటి విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

## ఆధునిక చరిత్రకే ప్రాధాన్యం:

- చరిత్ర ప్రశ్నల తీరును గమనిస్తే.. ఆధునిక భారతదేశ చరిత్ర ప్రాధాన్యం స్పష్టమవుతోంది. ప్రాచీన, మధ్య యుగాల నుంచి కాకుండా ఈ అంశం నుంచే ఎక్కువ ప్రశ్నలు అడుగుతున్నారు. 2004లో 21 ప్రశ్నలు, 2005లో 22, 2006లో 19, 2007లో 13, 2008లో 14 ప్రశ్నలు అడిగారు.
- యూపీఎస్సీ ఆధునిక భారతదేశ చరిత్ర, స్వాతంత్ర పోరాటం అంశాలను సిలబస్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించడాన్ని బట్టి జనరల్ స్టడీస్ పరంగా ఇది అత్యంత ప్రముఖ విభాగంగా అభ్యర్థులు గుర్తించాలి.
- అంశాల వారీగా పరిశీలిస్తే... ఆధునిక భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యోద్యమాన్ని ముఖ్య విభాగంగా గుర్తించాలి. ఈ విభాగం నుంచి 2008లో 10 ప్రశ్నలు వచ్చాయి. భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలు, మితవాద-అతివాద, విప్లవ ఉద్యమాల నుంచి ఎక్కువగా అడుగుతున్నారు. అలాగే పలువురు నాయకులు స్థాపించిన పత్రికలు, సంస్థల గురించి ప్రస్తావిస్తున్నారు.
- ఇతర ముఖ్యాంశాల విషయానికి వస్తే.. బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణ విధానాలు, గవర్నర్ జనరల్స్, రాజ్యాంగ సంస్కరణలు, గిరిజన పోరాటాలు, 1857 సిపాయిల తిరుగుబాటులో ముఖ్య నాయకులు, సాంస్కృతిక పునర్జీవం నాటి ముఖ్యమైన ఉద్యమాలు-పత్రికల గురించి ప్రశ్నలు

వస్తున్నాయి.

- స్వాతంత్ర్యోద్యమంలో అడుగుతున్న ప్రశ్నల స్థాయిని కూడా పరిశీలించడం అవసరం. వివిధ దేశాల్లో ప్రముఖ నాయకుల గురించి ప్రశ్నలు అడుగుతున్నారు. ఉదాహరణకు.. మితవాదుల్లో ముఖ్యుడైన దాదాభాయ్ నౌరోజీ వలస పాలనను Un British అని పేర్కొనడం, అతివాదానికి ఆద్యుడైన అరబిందో "New Lamps for the Old' అనే కరపత్రాన్ని రాయడం, విప్లవవాది రాస్ బీహారీ బోస్ ఫ్రీ ఇండియా లీజియన్ స్థాపించడం వంటి ప్రశ్నలను బట్టి ఆయా వాదాలకు సంబంధించిన ముఖ్యులపై ప్రశ్నలు అడగుతున్నారని గుర్తించాలి.
- ముఖ్యమైన గవర్నర్ జనరల్స్, వాళ్లు చేపట్టిన సంస్కరణల మీద కూడా ప్రశ్నలు సంధిస్తున్నారు. లార్డ్ లిట్టన్, లార్డ్ రిప్పన్ సంస్కరణలపై దృష్టిపెట్టాలి. పలువురు సంస్కర్తలు, వారు స్థాపించిన పత్రికలు-సంస్థల గురించి తెలుసుకోవడం మంచిది. ఇందులో అల్‌హిలాల్ పత్రిక వ్యవస్థాపకుడు, ఆనందమఠ్ నవల ప్రాధాన్యం వంటి ముఖ్యమైన విషయాలను గుర్తించాలి. రాజ్యాంగ సంస్కరణలు.. ముఖ్యంగా 1909 మింటో-మార్లే సంస్కరణలు, 1935 భారత ప్రభుత్వ చట్టం, ముఖ్యమైన కమిటీలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

**ప్రామాణిక పుస్తకాలు :**

- ఎన్‌సీఈఆర్‌టీ - పాత 11, 12వ తరగతుల పుస్తకాలు.
- తెలుగు అకాడెమీ - ప్రాచీన, మధ్యయుగాల చరిత్ర పుస్తకాలు
- బిపిన్ చంద్ర - ఆధునిక భారతదేశ చరిత్ర
- గ్రోవర్ అండ్ గ్రోవర్ - మోడ్రన్ ఇండియా.

**తెలుగు మీడియం అభ్యర్థుల కోసం:**

- నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్‌బీటీ) ఈ మధ్యనే అనువదించిన భారత స్వాతంత్ర్య పోరాటం.
- తెలుగు అకాడమీ - ఆధునిక భారతదేశ చరిత్ర
- బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ తెలుగు మీడియం పీజీ ఆధునిక భారతదేశ చరిత్ర పుస్తకాలు.
- ఏ విభాగానికి ఎంత ప్రాధాన్యం, అడుగుతున్న ప్రశ్నల తీరు వంటి విషయాలకు Competition Wizard మ్యాగజీన్ చూడొచ్చు.

**విభాగాల వారీగా అడిగిన ప్రశ్నల సంఖ్య**

| సంవత్సరం | ప్రాచీన, మధ్యయుగాల చరిత్ర | ఆధునిక చరిత్ర |
|---|---|---|
| 2005 | 1 | 21 |
| 2007 | 1 | 12 |
| 2008 | 2 | 14 |